క్లుప్తంగా

కార్యాలయానికి చేరేదెలా ?



ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లాలంటే బురద దాటాల్సిందేని ప్రజలు వాపోతున్నారు. వర్షం పడిన ప్రతిసారి ఇదే పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించుకున్న చర్యలు మాత్రం చేపట్టడం లేదని పేర్కొంటున్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



గద్వాల: ఈ నెల 17న హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి(ఇండో–నేపాల్) కరాటే పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు అరవింద్, శరత్ బంగారు పతకం, చార్విక్, అభి వెండి, వేద జనని బ్రౌంజ్ పతకం సాధించినట్లు యమగూచి కరాటే మాస్టర్ శేఖర్, రవి తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ శంకర్ మంగళవారం అభినందించారు. భవిష్యత్‌లో మరింత ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

చెక్‌డ్యాంలతో భూగర్భ జలాలు పెంపు



మానవపాడు: చెక్‌డ్యాం నిర్మాణాలతో భూగర్భ జలాలు పెరుగుతాయని అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు సూచించారు. మంగళవారం చిన్నపోతులపాడు చెక్‌డ్యాంను, చంద్రశేఖర్‌నగర్, కొర్విపాడులోని ఎన్‌ఆర్‌జీఎస్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా 256 పనులలో చెక్‌డ్యాం నిర్మాణం ఒకటని, చిన్నపోతులపాడు గ్రామంలో నిర్మించిన చెక్‌డ్యాం వల్ల దాదాపు ఆరకిలోమీటర్ మేర నీరు నిలువ ఉంటుందన్నారు. చెక్‌డ్యాం చుట్టుపక్కల బావులు ఉన్నాయని, వాటిల్లో భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. అదేవిధంగా నీటి నిల్వ వల్ల గ్రామస్తులకు చాలా రకాలుగా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవ, ఏపీఓ విజయ్‌శంకర్, చెన్నకేశవులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన

ధరూరు: మండల పరిధిలోని మార్లబీడు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఎంఈఓ రవీంద్ర బాబు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైఓల్టేజీతో పరికరాలు దగ్ధం

మల్దకల్: మండలంలోని కుర్తిరావులచెర్వులో మంగళవారం తెల్లవారు జామున విద్యుత్ హైఓల్టేజ్ రావడంతో ఇళ్లలో ఉన్న ఎలక్ట్రిక్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. అదే విధంగా గ్రామంలో పలు ఇళ్లకు విద్యుత్ సరఫరా అయినట్లు గ్రామస్తులు తెలిపారు. సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు పేర్కొన్నారు.

పౌర హక్కుల నేతకు పరామర్శ

మల్దకల్: మండలంలోని ఎల్కూరు గ్రామానికి చెందిన పౌరహక్కుల సంఘం నేత దళిత మహేష్ సోమవారం రాత్రి కత్తిపోట్లకు గురైన విషయం తెలిసిందే. కర్నూలులో చికిత్స పొందుతున్న ఆయన్ను మంగళవారం జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, పలువురు నాయకులు వేర్వేరుగా పరామర్శించారు.

పాత పింఛన్ విధానాన్నే పునరుద్ధరించాలి

ధరూరు: పాత పింఛన్ విధానాన్నే పునరుద్ధరించాలని పీఆర్టీయూ మండల శాఖ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న నిర్వహించే నిరసన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్ జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి, ఎంఈఓ రవీంద్రబాబు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, రఫీక్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలనీలు మురుగుమయం..!



ధరూరులోని ఎస్సీ కాలనీలో రోడ్డుపై నిలిచిన మురుగు

- ఐదు రోజులుగా ఎడతెరపి లేని వర్షాలు
- కాలనీల్లో రోడ్లపై నిలిచిన వర్షపు నీరు
- పట్టించుకోని ప్రత్యేక అధికారులు

ధరూరు: గత ఐదు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలోని పలు కాలనీల్లో కాలు కదపలేని పరిస్థితిని నెలకొందని ప్రజలు వాపోతున్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక అధికారులు పాలనలో ప్రజా సమస్యలు గాలికొదిలేసినట్లుగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యదర్శులను అడిగినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కాలనీలు జలమయం...

మండల కేంద్రంలోని కుర్వ వీధి, పోస్టాఫీసు, కాలికాదేవి గుడి, ఎస్సీ కాలనీలతో పాటు చింతరేవుల, నెట్టెంపాడు, కోతులగిద్ద తదితర గ్రామాల్లోని అంతర్గత రోడ్లపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికి తోడు మురుగు తోడవడంతో దోమల ఉధృతితో అనారోగ్యం బారిన పడుతున్నట్లు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

నిలిచిన వర్షపు నీటిని తొలగించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. కాలనీల్లో మురుగు, దోమలతో అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



వర్షపు నీరు, మురుగు తొలగించేందుకు పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే సూచించాం. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకుంటాం. పాతబడిన ఇళ్లల్లో ఉన్న వారిని పాఠశాల భవనాలు, కమ్యూనిటీ భవనాల్లో తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– అబ్దుల్ సయ్యద్‌ఖాన్, ఎంపీఓ



మాలవీధి సమీపంలో నిలిచిన మురుగుతో కూడిన వర్షపు నీరు



కుర్వ వీధిలో ఇళ్ల మధ్య నిలిచిన నీరు



చింతరేవులలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

చెరువులను తలపిస్తున్న రోడ్లు

గద్వాల: జిల్లా కేంద్రంలో ప్రధాన రోడ్లు చిన్నపాటి వర్షాలకే చెరువులను తలపిస్తున్నాయని బీజేపీ నాయకులు మండిపడ్డారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రధాన రహదారిలోని వర్షం నీటిలో వరినాట్లు వేసి నిరసన తెలియజేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే ఏ పార్టీకి చెందిన వారో తెలియదని ఇక ఆయనకు గద్వాల అభివృద్ధిపై ధ్యాస లేకుండా పోయిందని దుయ్యబట్టారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీపై పోటీ చేసిన అభ్యర్థికి ప్రజలు అత్యధిక ఓట్లు వేస్తే ఆమె అధికార పార్టీలో ఉన్నప్పటికీ రాజకీయ ఆధిపత్యం తప్పితే గద్వాల అభివృద్ధిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. అనంతరం ఆర్‌అండ్‌బీ శాఖ ఏఈకి రోడ్ల అధ్వాన్న స్థితిపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బండల వెంకట్రాములు, రజక జయశ్రీ,, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చౌరస్తాలో వరినాట్లు వేసి నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

‘వీసీ’ల ద్వారా రైతులకు అవగాహన



లింగన్‌వాయిలో వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ అధికారులు



కేటీదొడ్డిలో వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, రైతులు

కేటీదొడ్డి: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలోని ఏఓ రాజవర్ధన్‌రెడ్డి, ఏఈఓ ప్రీతిసుధ రైతులకు అవగాహన కల్పించారు.

లింగస్‌వాయిలో వీడియో కాన్ఫరెన్స్

అలంపూర్‌రూరల్: మండలంలోని లింగస్‌వాయి రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి సక్రియనాయక్ హాజరై రైతులతో మాట్లాడారు. మామిడి తోటల యాజమాన్యం, డ్రోన్ టెక్నాలజీ వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగార్జునరెడ్డి, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

అమరవాయి వాసికి డాక్టరేట్

మానవపాడు: పాలమూర్ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ విభాగంలో మండలంలోని అమరవాయి గ్రామానికి చెందిన రవికుమార్‌కు పీఎచ్‌డీ పట్టా పొందాడు. ఇస్రో చైర్మన్ నారాయణ్, ఉపకులపతి కుమార్ మొల్గరం చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో అందుకున్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

రాజోళి: మండల కేంద్రం నుంచి శాంతిగనర్‌కు వెళ్లే బీటీరోడ్డు పనులు పూర్తి చేయాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. 7 కి.మీ. దూరంలో నాలుగు కి.మీ. మేర పనులు పూర్తి చేయకుండా అలాగే వదిలేశారన్నారు. గుంతలమయంగా ఉన్న రోడ్డుపై కురుస్తున్న వర్షాలతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, ఆనంద్‌బాబు, జయన్న, గోవిందు, నర్సింహు పాల్గొన్నారు.

వేడుకగా మొక్కార్తి బోనాలు

ఎర్రవల్లి: మండల పరిధిలోని తిమ్మాపురంలో మంగళవారం మొక్కార్తి బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాడి పశువులను ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామదేవత సుంకులమ్మకు కొత్త కుండల్లో ప్రత్యేక నైవేద్యాన్ని వండి ఊరేగింపుగా వెళ్లి బోనాలు సమర్పించారు.



చిత్రం చెప్పే సంగతులెన్నో..



గద్వాలలో సీనియర్ ఫొటోగ్రాఫర్‌ను సన్మానిస్తున్న బండల వెంకట్రాములు



ధరూరులో..

- ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

గద్వాలటౌన్/ధరూరు/శాంతినగర్/అయిజ/గట్టు/: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ధరూరు మండల కేంద్రంలో ఫొటోగ్రాఫర్స అసోసియేషన్ మండల అధ్యక్షులు ప్రవీణ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతిక్షణాన్ని మధుర జ్ఞాపకంగా చూపించేది, కాలగర్భంలో కలిసి చరిత్రను సజీవంగా నిలిపేదే ఫొటోగ్రఫీ అని వారు అన్నారు. కార్యక్రమంలో శ్యామ్, రమేష్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

❍ వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లో ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో శాంతిరాజు, రామకృష్ణ, అబ్బాస్, అంజిబాబు, రషీద్, జాన్‌రవి తదితరులు పాల్గొన్నారు.

❍ అయిజ మండల కేంద్రంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు రామకృష్ణ, బాష, మల్లికార్జున్, గోవిందునాయుడు, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

❍ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి అసోసియేషన్ చైర్మన్ బండల వెంకట్రాములు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణంరాజు, అంజి, కిషోర్, కృష్ణ పాల్గొన్నారు.

❍ గట్టులో ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో నర్సింహులు, వెంకటేష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలను రైతులు సద్వినియోగించుకోవాలి

ఎర్రవల్లి: డీసీసీబీలో అందిస్తున్న వివిధ రుణాలను రైతులు సద్వినియోగించుకోవాలని ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని డీసీసీబీ కార్యాలయంలో కర్షక మిత్ర స్కీం ద్వారా రుణాలు మంజూరైన 11 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డీసీఓ శ్రీనివాసులు, డైరెక్టర్ రంగారెడ్డి, సంఘం వైస్‌చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు నర్సింహులు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అలంపూర్: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూలులోని క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీ, చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. అయిజ మండలం బింగిదొడ్డికి చెందిన ఉప్పరి శీలగుంటికి రూ.30 వేలు, సింధనూరుకు చెందిన సుధాకర్‌కు రూ.46,500, ఉండవెల్లి మండలం భైరాపురానికి చెందిన షేక్ హుస్సేన్‌కు రూ.4 లక్షలు, అయిజ మండలం ఎక్లాస్‌పురానికి చెందిన విజయ్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1.70 లక్షల ఎల్‌ఓసీ మంజూరైనట్లు పేర్కొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

మల్దకల్: ఎరువులు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ సంగీత లక్ష్మి ఫర్టిలైజర్ నిర్వాహకులను హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. షాపు నిర్వాహకులు రైతులకు ఎరువులను విక్రయించిన వెంటనే రశీదులను ఇవ్వాలన్నారు. ఈ–పాస్ మెషిన్ ద్వారానే ఎరువులు, మందులు పంపిణీ కార్యక్రమం చేపట్టాలని, స్టాక్ వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. అనుమతులు లేని ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్, ఏఈఓ ఖాజాపాష, తదితరులు పాల్గొన్నారు.



ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ సంగీతలక్ష్మి

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి ఈదన్న

అలంపూర్: భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఈదన్న కోరారు. పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మొక్కజొన్న, కంది, పత్తి, ఉల్లి, మినుములు, మిరప పంటలు నీట మునిగినట్లు వాపోయారు. సుమారు ఎకరాకు రూ.50 వేల నష్టం జరిగినట్లు తెలిపారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. ప్రభుత్వం తక్షణమే నష్టపోయిన పంటలను గుర్తించి పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మట్టి మిద్దెల్లో ఉంటున్న వారికి రూ.10 వేల తక్షణ సాయం అందించాలన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లలో మరమ్మతు చేపట్టి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, నరసింహ, వెంకటస్వామి, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉత్సవమూర్తుల ఊరేగింపు



అయిజలో పల్లకీ మోస్తున్న ఎమ్మెల్యే విజయుడు



ధరూరులో..

అయిజ: కృష్ణాష్టమిని పురస్కరించుకొని మండల కేంద్రంలో మంగళవారం మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. ఊరేగింపులో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరై పల్లకీ మోసారు. ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు వేడుకలు నిర్వహించారు. అదే విధంగా మండల కేంద్రంలో మారెమ్మ గ్రామదేవత ఉత్సవమూర్తిని ఊరేగించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

రాజోళి: మండల కేంద్రంలో శ్రావణమాసం చివరి మంగళవారం సందర్భంగా కోట ఆంజనేయస్వామి భక్తులు విశేష పూజలు చేశారు.తుంగ భద్ర జలాలతో అభిషేకం చేసి ఆకు పూజలు చేశారు.

ఘనంగా నందికోల సేవ

ధరూరు: మండల కేంద్రంలోని శివాలయంలో సోమవారం రాత్రి నిర్వహించిన నందికోలు సేవ కార్యక్రమం వైభవంగా జరిగింది. శ్రావణ మాసం చివరి సోమవారం కావడంతో జాంపల్లి గ్రామ శివారులోని గట్టు వీరన్న ఆలయం వరకు భక్తులు కాలినడకన వెళ్లి వీరన్నస్వామికి ప్రత్యేక పూజలు చేసి ధరూరు వరకు భజన కార్యక్రమాలు చేపట్టారు. అఖండ భజన కనులపండువగా సాగింది.

అర్థమయ్యే ఉపకరణాలు రూపొందించాలి

గట్టు: తరగతి గదుల్లో విద్యార్థులకు సులభంగా పాఠ్యాంశాలను అర్థం చేసుకునే ఉపకరణాలను ఉపయోగించి బోధించాలని ఎంపీడీఓ చెన్నయ్య, ఎంఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో మండల స్థాయి ఎఫ్‌ఎల్‌ఎన్, టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ప్రతి పాఠశాల నుంచి గణితం, తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టులకు సంబంధించి బోధన ఉపకరణాలను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు నల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, వివిధ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.



బోధన ఉపకరణాలను పరిశీలిస్తున్న అధికారులు

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



జిల్లా కేంద్రంలో వినతిపత్రం ఇస్తున్న ఆశాలు

గద్వాల/గట్టు/మానవపాడు/అయిజ/ఇటిక్యాల/ధరూరు: ఆశా వర్కర్లకు పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ డిమాండ్ చేశారు. మంగళవారం ఆశా వర్కర్లతో కలిసి సీఐటీయూ నాయకులు గట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వీవీ నర్సింహ మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల పెండింగ్ వేతనాలతో పాటుగా కనీస వేతనం రూ. 18 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఆరోగ్య బీమా సౌకర్యాలతో పాటుగా పదవీ విరమణ తర్వాత కలిగే లబ్ధి, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆరు నెలల ఎరియర్స్ ఇవ్వాలన్నారు. అనంతరం వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు సరస్వతి, శ్రీదేవి,గోవిందమ్మ, సుజాత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

❍ ఆశా వర్కర్లకు జూలై నెల పారితోషకాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రకమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని దవాఖానా ఎదుట ధర్నా చేశారు. అనంతరం డాక్టర్ మాధ్యుర్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పద్మ, సునీత, లక్ష్మీబాయి, శ్రీదేవి, జయలక్ష్మీ, రమాబాయి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

❍ మానవపాడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వర్షంలో ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. పనిభారం పెరిగి, సెలవులు లేకుండా పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించకుంటే సెప్టెంబర్ 1న ,లో హైదారాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

❍ అయిజ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశాలు నిరసన వ్యక్తం చేశారు.

❍ సీఐటీయూ ఆదేశాల మేరకు ఇటిక్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వైద్యురాలు శరణ్యకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నర్సమ్మ, గోపాలమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

❍ ఆశా వర్కర్లకు సంబంధించిన జూలై నెల వేతనాన్ని వెంటనే చెల్లించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. ధరూరు మండల పరిదిలోని ఉప్పేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా వర్కర్లతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అబేద, నర్సింగమ్మ, లక్ష్మి, వరలక్ష్మి, కల్పన, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



ఉప్పేరు పీహెచ్‌సీ వద్ద..



ఇటిక్యాలలో..